క్లుప్తంగా

స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు షురూ..



తరగతులు ప్రారంభిస్తున్న జి.సుధాకర్

ఇల్లెందు: సింగరేణి ఏరియా జీఎం వి.కృష్ణయ్య ఆదేశానుసారం సింగరేణి జేకే హైస్కూల్‌లో ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులను కరస్పాండెంట్ జి.సుధాకర్ సోమవారం ప్రారంభించారు. జూన్ 6 వరకు తరగతులు ఉంటాయని, 7, 8, 9 తరగతుల విద్యార్థులతో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థులు కూడా హాజరుకావొచ్చని చెప్పారు. కాగా, తొలి రోజు 60 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగరేణి హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేటివ్ ఇన్‌చార్జ్ బి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న మోదుగు జోగారావు

కొత్తగూడెంటౌన్: రాజీవ్ యువ వికాసం పథకంతోపాటు అన్ని అంశాల్లోనూ ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని మాదిగ జేఏసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మోదుగు జోగారావు కోరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం అందించారు. జిల్లాకు మంజూరైన రాజీవ్ యువ వికాసం 3,800 యూనిట్లలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని, గ్రూప్–1కు ఒక శాతం, గ్రూప్–2కు 9 శాతం, గ్రూప్–3కి 5 శాతం రిజర్వేషన్లను మండలాల వారీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవంగి వెంకటరమణ, రాజేశ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు సంఘం బాధ్యులతో సమావేశం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా గుర్తింపు సంఘం ప్రతినిధులతో ఏరియా జీఎం కృష్ణయ్య సోమవారం సమావేశం నిర్వహించారు. పని స్థలాల్లో కార్మికులు ఎదుర్కొనే అంశాలపై చర్చించారు. సమావేశంలో గుర్తింపు సంఘం నాయకులు సారయ్య, నజీర్ అహ్మద్, ముస్తఫా, శ్రీనివాసరావు, రాజారాం, అధికారులు రామస్వామి, గోవిందరావు, కృష్ణమోహన్‌రావు, గిరిధర్‌రావు, నరసింహరాజు, జీవీ మోహన్‌రావు, రవికుమార్, నాగరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఐలు జిల్లా కమిటీ ఎన్నిక

కొత్తగూడెంటౌన్: అల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సోమవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన సమావేశంలో జాతీయ కౌన్సిల్ సభ్యుల జె.శివరాంప్రసాద్, జిల్లా కార్యదర్శి రమేశ్‌మక్కడ్ ఆధ్వర్యంలో గౌరవాధ్యక్షులుగా కె.పుల్లయ్య, అధ్యక్షులుగా ఆర్.రామారావును ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కె.పురుషోత్తం, ఉపాధ్యక్షులుగా పిట్టల రామారావు, టి.రమేశ్, కార్యదర్శులుగా యు.అరుణ్, అభిలాష్, కోశాధికారిగా డి.రవికుమార్ తదితరులను ఎన్నుకున్నారు.

జవాబుదారీతనం కోల్పోతున్న అధికారులు

కొత్తగూడెంఅర్బన్: అధికారులు జవాబుదారీతనం కోల్పోతున్నారని ఆజాద్ అధికార్ సేన పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ బోడికల ప్రేమ్‌దయాళ్ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కలెక్టరేట్‌లో ఓ కీలక విభాగం సమాచారం కోసం సహ చట్టం–2005ను అనుసరించి ఫిబ్రవరి 18వ తేదీన పోస్ట్ ద్వారా దరఖాస్తు చేసుకోగా.. గడువులోగా సమాచారం ఇవ్వలేదని, ఈ నెల 9వ తేదీన మళ్లీ అప్పీలు చేయగా, కనీసం దరఖాస్తు కూడా పరిశీలించకుండా అదే పోస్టుపై చిరునామా సరిగా లేదని తిరిగి పంపించారని ఆరోపించారు. ఈ అంశంపై అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్‌కు ఫిర్యాదు చేశామని వివరించారు.

ప్రపంచ శాంతిదూత పోప్

టేకులపల్లి: ఫ్రాన్సిస్ పోప్ ప్రపంచ శాంతి దూత, దైవ స్వరూపులు అని సులానగర్ ఆర్‌సీఎం చర్చి ఫాదర్ మార్నెని అర్లయ్య అన్నారు. సోమవారం చర్చి వద్ద ఫ్రాన్సిస్ పోప్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

శవపేటిక వితరణ

పాల్వంచరూరల్: మండలంలోని సోములగూడెం గ్రామ పంచాయతీకి కేశవాపురం గ్రామానికి చెందిన అంగోతు వాల్యా జ్ఞాపకార్థం శవపేటికను వితరణగా అందించారు. వాల్యా భార్య హచ్చి, కుమారులు రమేశ్, నరేశ్, సురేశ్ సోమవారం ఎంపీటీ నారాయణకు అందజేశారు. మోకాల కృష్ణవేణి, గుగులోతు రవికుమార్, సంఘ ప్రవీణ్, షేక్ సైహెద్‌బాబా, అచ్చ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆటలు నేర్చుకుందామా..

- ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు ఏర్పాట్లు
- వచ్చే నెల 1 నుంచి క్యాంప్‌ల నిర్వహణ
- జిల్లావ్యాప్తంగా 30 శిబిరాలు



కొత్తగూడెంలోని సమ్మర్ క్యాంప్‌లో కరాటే శిక్షణ పొందుతున్న చిన్నారులు (ఫైల్)

కొత్తగూడెంటౌన్: పాఠశాలలకు వేసవి సెలవులు వచ్చేశాయి. ఇక ఆటలు ఆడేందుకు సమయం వచ్చింది. వరుసగా వేసవి సెలవులు కావడంతో విద్యార్థులందరూ ఇంటి వద్దే ఉంటూ తమకు నచ్చిన ఆటపాటలతో గడుపుతారు. అలాంటి వారిలో క్రీడా నైపుణ్యం ఉంటే క్రీడాపోటీల్లో పాల్గొంటూ, ప్రాక్టీస్ చేస్తూ ఈ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటుంటారు. ఇలాంటి వారి కోసం జిల్లా క్రీడలశాఖ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో సమ్మర్ క్యాంప్‌లను నిర్వహించనుంది. ఈ ఏడాది 30 క్యాంప్‌లు ఏర్పాటు చేసి, శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సెలవుల్లో ఆటల్లో శిక్షణ తీసుకుని మరింతగా మెరుగయ్యేందుకు విద్యార్థులు కేంద్రాలకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. వేసవిలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌లలో శిక్షణ పొందిన క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపికై ప్రతిభ చూపాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిర్వహణకు రూ.10 వేలు

సమ్మర్ క్యాంప్‌ల నిర్వహణకు స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో రూ.10 వేలు కేటాయిస్తోంది. కోచ్‌కు రూ.5 వేలు, క్రీడా సామగ్రికి మరో రూ.5 వేలు కలిపి రూ.10 వేలను కేటాయిస్తారు. జిల్లాలో దాదాపు 30 క్యాంప్‌ల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు శిక్షణ ఇస్తారు.

ఈ ఆటల్లో శిక్షణ

మే 1 నుంచి 31 వరకు ఈ శిక్షణ శిబిరాలు కొనసాగుతాయి. కోచ్‌ల ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇస్తారు. క్రికెట్, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, రెజ్లింగ్, హాకీ, తైక్వాండో, కరాటే, ఉషూ, బాక్సింగ్, ఆర్చరీ, టెన్నిస్ వంటి క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నారు. కాగా, గతేడాది జిల్లాలోని 15 మైదానాల్లో వివిధ క్రీడల్లో శిక్షణ ఇవ్వగా బాలురు 524 మంది, బాలికలు 151 మంది హాజరయ్యారు. కాగా, ఇప్పటి వరకు 40 మంది కోచ్‌లు జిల్లావ్యాప్తంగా దరఖాస్తు చేసుకోగా అందులో కొందరిని ఎంపిక చేసుకుని, 30 క్యాంప్‌లలో శిక్షణ ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్నామని జిల్లా క్రీడలశాఖ అధికారి ఎం.పరందామరెడ్డి వెల్లడించారు.

క్రికెట్ శిక్షణకు ఎక్కువ మంది..



ప్రతి రోజూ ఇక్కడ క్రికెట్‌లో శిక్షణ ఇస్తాం. 100 మందికి పైగా క్రీడాకారులు కోచింగ్ తీసుకుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ కొనసాగుతోంది. అందరు క్రీడాకారులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి.

–పి.సాయినిరంజన్, క్రికెట్ కోచ్

శిక్షణ ఉపయోగపడుతుంది..



వేసవి శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయి. నెల రోజుల పాటు ఉదయం, సాయంత్రం శిక్షణ ఉంటుంది. రెజ్లింగ్, అథ్లెటిక్స్‌ల్లో శిక్షణ కోసం అధిక సంఖ్యలో చిన్నారులు వస్తున్నారు.

–పి.కాశీహుస్సేన్, జిల్లా ప్రధాన కార్యదర్శి, రెజ్లింగ్ అసోసియేషన్

30 క్యాంప్‌ల నిర్వహణ



జిల్లా వ్యాప్తంగా 30 సమ్మర్ క్యాంప్‌ల ద్వారా ఔత్సాహికులకు శిక్షణ ఇవ్వనున్నాం. ఇప్పటికే కోచ్‌ల ఎంపిక ఓ కొలిక్కి వచ్చింది. క్రీడాకారులు హాజరై ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి.

–ఎం.పరంధామరెడ్డి, డీవైఎస్‌ఓ

బాల్య వివాహాలను నిర్మూలించాలి



మాట్లాడుతున్న ముస్లిం మతపెద్దలు

టేకులపల్లి: బాల్య వివాహాల నిర్మూలనలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వామ్యులు కావాలని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ హరిప్రసాద్‌రావు పిలుపునిచ్చారు. ఏఐడీ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనకు మత గురువుల పేరిట తలపెట్టిన కార్యక్రమం సోమవారం టేకులపల్లి బైతుల్లా మసీదులో నిర్వహించారు. బాల్య వివాహాల నిర్మూలనకు తమవంతు కృషి చేస్తామని ముస్లిం మతపెద్దలు హామీ ఇచ్చారు. బాల్య వివాహాల నిర్మూలనకు ఏఐడీతో పాటు యాక్సెస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్స్ భాగస్వామ్యంతో రెండు రోజులుగా ప్రముఖ దేవాలయాలు, మసీదులు, చర్చిల వద్ద మతపెద్దలు, అర్చకులు, ఫాదర్లు, పాస్టర్ల సహకారంతో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాన్‌సింగ్, సదర్ హనీఫ్, హఫీజ్ అబ్దుల్ అజీమ్, హాజీ, రఫీ పాల్గొన్నారు.

పట్టుబడిన వాహనాలకు వేలం

ఇల్లెందు/కొత్తగూడెంటౌన్: ఇల్లెందు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను మంగళవారం వేలం వేయనున్నట్లు సీఐ రాంప్రసాద్ తెలిపారు. రెండు ఆటోలు, నాలుగు బైక్‌లు, ఒక ట్రాలీ ఉండగా, ఆసక్తి కలిగిన వారు వేలం పాటలో పాల్గొనాలని సూచించారు. అలాగే, కొత్తగూడెం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన వాహనాలను బుధవారం వేలం వేయనున్నామని ఎక్సైజ్ సీఐ జయశ్రీ తెలిపారు. వాహనం ధరలో 50 శాతం చెల్లించి వేలంలో పాల్గొనాల్సి ఉంటుందని, ఆధార్‌కార్డు, పాన్‌కార్డుతో హాజరు కావాలని సూచించారు.

వడదెబ్బ బారిన పడకుండా అవగాహన

సింగరేణి(కొత్తగూడెం): ఎండల దృష్ట్యా సింగరేణి కార్మికులు వడదెబ్బకు గురికాకుండా గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద అవగాహన కల్పిస్తున్నట్లు సింగరేణి ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్‌రాజ్‌కుమార్ తెలిపారు. ఎండ నుంచి ఉపశమనం కలిగించేలా మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్మికులు కూడా వైద్యుల సూచనలు పాటిస్తూ, దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కాగా, సింగరేణి కార్మికులు, వారి కుటుంబీకుల ఆరోగ్య పరిరక్షణకు హైదరాబాద్‌లో రూ.150 కోట్ల వ్యయంతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అంతేకాక మెడికల్ బోర్డ్ ప్రక్షాళనపైనా దృష్టి సారించామని కిరణ్‌రాజ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎండల విషయంలో కార్మికులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోజురోజుకూ ఎండ తీవ్రత పెరుగుతోందని, తొందరగా డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఎప్పటికీ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు.

హక్కుల సాధనకు పోరాటం



ఇల్లెందురూరల్: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ నాయకులు

టేకులపల్లి: నాలుగు లేబర్ కోడ్‌లు, పని గంటల పెంపునకు వ్యతిరేకంగా మేడే స్ఫూర్తితో పోరాటం చేద్దామని టీయూసీఐ ఏరియా కార్యదర్శి జర్పుల సుందర్, మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పాయం వెంకన్న పిలుపునిచ్చారు. సోమవారం 139వ మేడే వేడుకలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ముందు తరాల కార్మికులు రక్తం చిందించి 8 గంటల పనివిధానం తెస్తే.. నేడు కేంద్రం ప్రభుత్వం కార్మికుల శ్రమను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకే నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో గుగులోత్ మదార్, ఏనుటి నాగన్న, షేక్ షఫీ, ప్రసాద్, ఎర్రమ్మ, బాబు, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయండి

ఇల్లెందురూరల్: నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా.. 139వ మేడేను నిర్వహించాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కొక్కు సారంగపాణి, సహాయ కార్యదర్శి రాసుద్దీన్ పిలుపునిచ్చారు. మండలంలోని చల్లసముద్రం, బొజ్జాయిగూడెం గ్రామ పంచాయతీల పరిధిలో సోమవారం మేడే ప్రచార వాల్‌పోస్టర్లను వారు ఆవిష్కరించి మాట్లాడారు. హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమల అమ్మకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నరాటి వెంకటేశ్వర్లు, రావూరి ఉపేందర్, సైదులు, గంగారపు కోటయ్య, తొండల సర్వయ్య, సురేశ్, లక్ష్మణ్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

చెత్తగా మారిపోయింది..

- రోజు విడిచి రోజు వార్డుకు చెత్తవాహనం
- నగానికి కుదించిన అధికారులు
- దెబ్బతిన్న పలు చెత్త సేకరించే వాహనాలు
- చెత్త తొలగింపులో అవస్థలు



దెబ్బతినడంతో మూలన పడిన చెత్త వాహనాలు

ఇల్లెందు: చెత్త సేకరణలో ముందువరుసలో ఉండే ఇల్లెందు మున్సిపాలిటీలో చెత్త సేకరణ వాహనాలను సగానికి కుదించారు. రోజు విడిచి రోజు ఒక వాహనం వార్డుకు వచ్చేలా ఏర్పాటు చేశారు. ఆదాయ భారం తగ్గించుకోవటంతో పాటు వాహనాలు దెబ్బతిని ఉండటంతో ఈ విధానం అమలు చేస్తున్నారు. మునుపటి వలే కాకుండా రోజు విడిచి రోజు ఒక వాహనం వార్డుకు వస్తోంది. దీంతో ఇళ్లల్లో ఉత్పత్తి అయ్యే చెత్త పేరుకుపోయి కోతుల నుంచి ఇక్కట్లు ఎదురవుతున్నాయి. మున్సిపాలిటీలో సగానికి పైగా చెత్త వాహనాలు దెబ్బతిని ఉంటున్నాయి. అధికారులు మాత్రం ఒక వాహనం రిపేరుకు వస్తే మరో వాహనం రిపేరు చేసి పంపిస్తున్నామంటున్నారు.

మొదలైంది ఇలా..

పట్టణంలో చెత్త సేకరించేందుకు 2020లో సుమారు రూ.కోటి పైగా నిధులు వెచ్చించి 20 వాహనాలు కొనుగోలు చేశారు. ప్రతీ వార్డుకు ఒక వాహనం అందుబాటులోకి తీసుకొచ్చారు. వార్డులో ప్రతీ ఇంటి నుంచి తడి – పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించారు. ఒక్కో వాహనానికి రూ.4.80 లక్షలతో ప్రత్యేకంగా తడి – పొడి చెత్త సేకరణకు వేర్వేరు డబ్బాలు అమర్చారు. తడి చెత్తకు గ్రీన్ బాక్సు, పొడి చెత్తకు బ్లూ బాక్సు ఏర్పాటు చేశారు. మైక్ ద్వారా ప్రచారం చేసుకుంటూ ఆయా వార్డుల్లో ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించేవారు. ప్రతీ ఇంటికి రెండు బుట్టలను అందజేశారు. ఇళ్లల్లో నుంచి ఉత్పత్తి అయిన చెత్తను బుట్టల్లో భద్రపర్చి ఈ వాహనానికి అందజేయటం అలవాటు చేశారు. ప్రతీ వాహనానికి ఒక డ్రైవర్, నెలకు రూ.6 వేలు వేతనం, డీజిల్‌కు రూ.300 వరకు వెచ్చించారు. ప్రతీ నెలా మున్సిపాలిటీకి అదనంగా రూ.3 లక్షల వరకు ఖర్చయింది. చెత్త సేకరించినందుకు ఇప్పటికే రిక్షా పుల్లర్స్ ప్రతీ ఇంటికి రూ.50 వసూలు చేస్తున్నారు. అయితే, ఏడాదికాలంగా సగానికి పైగా చెత్త సేకరణ వాహనాలు రిపేరులో ఉన్నాయి. వార్డులకు రెండు మూడురోజులకు ఒక వాహనం వస్తోంది. దీంతో చెత్త నిల్వ పెరిగి దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. కోతుల బెడద తీవ్రంగా ఉంది.

రోజూ వస్తేనే ఉపయోగం..



ప్రతీ రోజూ ఇంటింటికీ చెత్త వాహనం వస్తేనే ఉపయోగం. రోజు విడిచి రోజు.. రెండు మూడు రోజులకు ఒకసారి వస్తే తీవ్ర అసౌకర్యంగా మారుతుంది. చెత్త బుట్టలు ఇంటి ఆవరణలో ఉండటం వల్ల కోతులు చిందర వందర చేస్తున్నాయి. చెత్త అంతా కింద పడిపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు పెరుగుతున్నాయి. అందుకే ప్రతీ రోజు వస్తే చెత్త శుభ్రం అవుతుంది.

–ఆలేటి సంధ్య, వినోభానగర్, ఇల్లెందు

రూ.23 వేల వేతనం చెల్లించాలి



సింగరేణి (కొత్తగూడెం): లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న జనక్‌ప్రసాద్, నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.23 వేలు చెల్లించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కోరారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో లేబర్ కమిషనర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశాక ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులకు రూ.23,275 వేతనం చెల్లించాలని హైకోర్టు తీర్పునిచ్చినా సింగరేణి యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. సంస్థలో సుమారు 32 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు ఉండగా, పదేళ్లలో వేతనాలు పెరగక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇకనైనా హైకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు అమలు చేయడమే కాక సెలవులు, ఈఎస్‌ఐ వర్తింపేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

ఈ నెల 30న నిరసన దీక్ష

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు వేతనాల పెంపు కోసం ఈనెల 30న కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట దీక్ష చేపడుతున్నట్లు కాంట్రాక్ట్ కార్మికుల జేఏసీ నాయకులు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో దీక్ష చేపట్టాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

వేతనాలు పెంచే వరకు పోరాటం

ఇల్లెందు: సింగరేణిలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచే వరకు పోరాటం తప్పదని టీయూసీఐ జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలి ప్రకటించారు. సోమవారం సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల మస్టర్ అడ్డాలో జరిగిన కార్మిక సంఘాల జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30న హెడ్ ఆఫీస్ వద్ద కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రాంసింగ్, పాయం వెంకన్న, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీతోనే హక్కుల సాధన



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సారయ్య

టేకులపల్లి: సింగరేణిలో కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్ల యూనియన్‌తోనే సాధ్యమవుతుందని కేంద్ర కమిటీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎండీ నజీర్‌అహ్మద్ తెలిపారు. మండలంలోని కోయగూడెం ఓసీ వద్ద సోమవారం గేట్ మీటింగ్ నిర్వహించగా, తొలుత పహల్గాం మృతులకు నివాళులర్పించారు. అనంతరం యూనియన్‌లో చేరిన ముగ్గురు జనరల్ మజ్దూర్లకు స్వాగతం పలికాక సారయ్య, నజీర్ మాట్లాడారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే జనరల్ మజ్దూర్లను జనరల్ అసిస్టెంట్లుగా మార్పించామని, కోయగూడెం ఓసీలో కార్మికులకు పదోన్నతులు ఇప్పించిన ఘనత తమదేనని చెప్పారు. కాగా, ప్రాతినిధ్య సంఘం బాధ్యులు జిల్లా మంత్రుల దృష్టికి తీసుకెళ్లి గనుల ప్రైవేటీకరణను అడ్డుకోవాలని సూచించారు. సమావేశంలో దాసరి రాజారాం, కొంగర వెంకటేశ్వర్లు, బానోత్ బాలాజీ, శ్రీనివాస్, షబ్బీర్, కనకరాజు, బాలుకుమార్, హరిలాల్, సంపత్, ఇర్పా వెంకటేశ్, వెంకటనర్సయ్య, శ్యాంసుందర్, ఉమామహేశ్వరరావు, రాజ్‌కుమార్, షేక్ వలీ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హనుమంతరావు

చుంచుపల్లి: లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లిలో సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ అధ్యక్షులు మండే వీరహనుమంతరావు ప్రారంభించారు. రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రూ.500 బోనస్ కూడా అందిస్తోందని తెలిపారు. కొత్తగూడెం సంఘం పరిధిలో 12 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, రెండు రోజుల్లో చుంచుపల్లి మండలంలో రెండు కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో చంద్రగిరి శ్రీనివాసరావు, పండ్ల సారయ్య, వెంకటనర్సయ్య, సంగెం రాము, సంగెం భాస్కర్‌రావు, జాల్లారాపు శ్రీనివాస్‌రావు, వెలిశాల రమేశ్, వెలిశాల సందీప్ పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



వస్త్రాలు అందజేస్తున్న ఎంఈఓ ప్రభుదయాళ్

సింగరేణి(కొత్తగూడెం): రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత ఏడాది 8.2 జీపీఏతో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థిని హిమబిందు ఇంటర్ మొదటి సంవత్సరంలో 470కి 458 మార్కులు సాధించింది. దీంతో రామవరం పాఠశాల హెచ్‌ఎం, ఎంఈఓ ప్రభుదయాళ్ సోమవారం ఆమెకు నూతన వస్త్రాలు, పుస్తకాలు అందజేసి అభినందించారు. హిమబిందు తండ్రి సుతారీ మేస్త్రీగా పని చేస్తుండగా, చదువుకు ఏవీ అడ్డురాదని నిరూపించిన ఆమె అభినందనీయురాలని పేర్కొన్నారు.

సీఐ అభినందన

జూలూరుపాడు: స్థానిక సాయి ఎక్సలెంట్ స్కూల్ విద్యార్థి బోడా ప్రజ్ఞతేజ ఏకలవ్య గురుకులంలో సీటు సాధించగా సోమవారం సీఐ ఇంద్రసేనారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ హుస్సేన్, విద్యార్థి తండ్రి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ల పెత్తనం తగదు..



ధర్నాలో మాట్లాడుతున్న జలాల్

కొత్తగూడెంఅర్బన్: ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో మాజీ కౌన్సిలర్లు పెత్తనం చెలాయిస్తూ, వారికి నచ్చిన వాళ్లకు కేటాయిస్తున్నారని, అర్హులకు అన్యాయం చేస్తున్నారని, మాజీ కౌన్సిలర్లను కమిటీల నుంచి తొలగించి పారదర్శకంగా ఎంపిక చేయాలని సేవ్ కొత్తగూడెం – సేవ్ మున్సిపాలిటీ కన్వీనర్ జలాల్ కోరారు. సోమవారం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డుల్లో ఉన్న నిరుపేదలు 807 మందికి 75 గజాల చొప్పున స్థలం గత ప్రభుత్వం ఇచ్చిందని, వారందరికీ ఎలాంటి షరతులు లేకుండా ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనర్హులకు ఇళ్లు ఇస్తే అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని, ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో మాజీ కౌన్సిలర్ల పెత్తనం ఉండొద్దని అధికారులకు సూచించారు. ధర్నాలో వెన్నెలనగర్ ప్రజలు పాల్గొన్నారు.

పెహల్గాం మృతులకు నివాళులు



ర్యాలీ నిర్వహిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యులు

ఇల్లెందు: జమ్మూ కశ్మీర్‌లోని పెహల్గాంలో ఉగ్రమూకల కాల్పులకు ప్రాణాలు కోల్పోయినవారికి ఇల్లెందులోని స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. సోమవారం రాత్రి ర్యాలీ నిర్వహించి, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎం.శ్రీనివాసరావు, అజిత్, జ్యోతి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ జేఏసీ ర్యాలీ

పెహల్గాంలో ఉగ్రదాడి మృతులకు నివాళిగా ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గుమ్మడి సమ్మయ్య, బాలు, జయరాజు, రాజు, రమేశ్, కొడెం కృష్ణ, లక్ష్మీనారాయణ, వెంకట్రాం, ఎమెల్యా పాల్గొన్నారు.